ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర





వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 | సంచిక : 10 | జూన్ 2019

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

30-03-1983
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-03-1983, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భౌతికంగానీ, ఆధ్యాత్మికంగానీ కూడా మీకు ఉదాత్తమైన భవిష్యత్తు, ఉజ్జ్వలమైన భవిష్యత్తు కోరుతూ నేను నిండు మనస్సుతో భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మీ శ్రేయస్సులోనే నా శ్రేయస్సు ఉంది, మీ క్షేమంలోనే నా క్షేమం కూడా ఉంది. మీ సంతోషం నాకు సంతోషం. మీ దుఃఖం నాకు దుఃఖం. మీరు ఈ గంటసేపు కూడా చాలా ప్రశాంతంగా కూర్చుని ఈ సమావేశానికి ఎంతో ఉన్నతస్థాయిని తీసుకొస్తున్నారు. నా ఈ ప్రసంగం కంటే మౌనం చాలా ముఖ్యమైనది. ఆదిగురువు దక్షిణామూర్తి కూడా పరబ్రహ్మ స్వరూపాన్ని మాటలతో చెప్పలేక మౌనంతోటే చెప్పారు. మౌనం కూడా బోధే. మౌనం బాధ అనుకోకండి. అందులో కూడా బోధ ఉంది. మీరు నాలుగు గంటలసేపు మీ శరీరంతోటి పూజ చెయ్యటం కంటే నాలుగు నిమిషాలు ఆత్మ గురించి వినటం వల్ల మీరు ఎంతో అభివృద్ధి పొందుతారు. పూజకి ఫలితం లేదు అని నేను అనటం లేదు, ఉంది. శరీరంతోటి చేసే పూజకి ఫలితం ఉంది. నోటితోటి చేసే జపానికి ఫలితం ఉంది. మనస్సుతోటి చేసే ధ్యానానికి, స్మరణకి ఫలితం ఉంది. వీటివల్ల ఫలితం ఉంది. ఇది భగవంతుడి యొక్క ఆజ్ఞ. అయితే ఈ శరీరం తోటి చేసే పూజ కంటే కూడా, ఇలా ఒక అయిదు నిమిషాలు ఈ మాటలు వినటం వల్ల, దానికంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. మీరు చేసే పూజ కంటే కూడా ఎక్కువ ప్రయోజనం, ఫలితాన్ని మీరు పొందుతారు. దైవానుగ్రహం అనేది బాహ్యంగా బహిరంగంగా వచ్చేది కాదు. దైవానుగ్రహం మీకు కలిగినప్పుడు, అది మీ హృదయంలో ప్రవేశించినపుడు, మీ హృదయానికి తెలుస్తుంది అనుగ్రహం ఎలా ఉంటుందో, అది మట్టుకు ఎవరికి జరిగినా రహస్యంగానే జరుగుతుంది.

రమణమహర్షి జ్ఞాని ఎలా అయ్యాడు అంటే దైవానుగ్రహం వల్లే అయ్యాడు. కాకపోతే ఆ అనుగ్రహం ఎలా వచ్చింది? ఎప్పుడు వచ్చింది? ఎక్కడ వచ్చింది? ఆయన కూడా చెప్పలేడు. మీరు ఈశ్వరుడితో సంబంధం పెట్టుకోవటం వల్ల ఎక్కువ ప్రయోజనాన్ని పొందుతారు. భగవంతుడితో మీకు మనస్సుతోటి సంబంధం ఉంటే దాని వలన ఎక్కువ మేలును పొందుతారు. మరి భగవంతుడిని స్మరించటం వల్ల ఏమిటి ప్రయోజనం? ప్రయోజనం ఉండాలి కదా అని మీరు అనుకోవచ్చును. దానివల్ల హృదయం విశాలం అవుతుంది, మనస్సు నిర్మలం అవుతుంది, బుద్ధి సూక్ష్మం అవుతుంది. భగవంతుడిని స్మరించటం వల్ల ఈ ప్రయోజనాలు అన్నీ వస్తాయి. బాగా సూక్ష్మాతిసూక్ష్మమైన విషయాలు కూడా అర్థం చేసుకునే శక్తి మీకు కలుగుతుంది. హృదయంలో మీరు భగవంతుడితో సంబంధం పెట్టుకోవటం వల్ల అతి కష్టమైన విషయం కూడా సూక్ష్మాతిసూక్ష్మమైన విషయంకూడా క్లిష్టమైన సమస్య కూడా మీకు తేటతెల్లంగా అర్థం అవుతుంది.

పూజలు చెయ్యటం కంటే విషయాన్ని అర్థం చేసుకోవటం వల్ల మీరు ఎక్కువ ప్రయోజనాన్ని పొందుతారు. మా దేవుడు గొప్పవాడు అంటే కాదు మా దేవుడు గొప్పవాడు అని లోకంలో ఎంతసేపూ ఇవే గొడవలు. సత్యానికంటే గొప్ప మతం లేదు. సత్యానికంటే గొప్ప దేవుడు లేడు. అందరి దేవుళ్ళకంటే సత్యం గొప్పది, అన్ని మతాల కంటే, అన్ని కులాల కంటే, అన్ని వర్ణాల కంటే సత్యం గొప్పది. అయితే ఏది సత్యం? ఆత్మ ఒక్కటే సత్యం. మనుషులు అందరికీ శరీరం ఉంది, అదేవిధంగా హృదయం కూడా ఉంది. మనకు ఉన్నది ఒకే హృదయం. అందులో ఈశ్వరుడికి అన్నా చోటు ఇవ్వాలి, లేకపోతే లోకానికి అన్నా చోటు ఇవ్వాలి. లోకానికి చోటిచ్చిన మీ హృదయంలో ఈశ్వరుడికి చోటు ఎక్కడ ఉంది? మీకున్న ఒక్క హృదయంలో లోకానికి చోటు ఇచ్చారు, లోకాన్ని అందులోంచి మీరు బయటికి లాగలేరు. బయటకి లాగకపోతే ఒకే హృదయంలో ఈశ్వరుడు, లోకం ఒకేచోట ఎలా కూర్చుంటారు? అందరికీ తలొక శరీరం ఉంది, అదేవిధంగా లోపల అందరికీ తలో హృదయం ఉంది. ఇందులో ఎవరికైనా మీ హృదయంలో ఈశ్వరుడికి స్థానం ఉందా? పైకి ఏమీ చెప్పవద్దు. మీ హృదయాలని మీరు పరిశీలించి చూసుకోండి, వెదికి చూసుకోండి. మీ ఇల్లు మీరు ఎలా వెతుక్కొంటున్నారో, మీ పెట్టి మీరు ఎలా వెతుక్కుంటున్నారో, అలా మీ హృదయాన్ని వెతుక్కోండి. అక్కడ ఏముంది? లోకమే ఉంది. లోపల ఈశ్వరుడు ఎక్కడైనా ఉన్నాడా? హృదయంలో లోకం ఉంది కాబట్టి, లోకంలోకి వస్తున్నాము. దీనికోసం పుస్తకాలు చదవనక్కరలేదు, బుర్రలు బద్దలుకొట్టుకోనక్కరలేదు, పేచీలు పెట్టుకోనక్కరలేదు. ఇది కామన్‌సెన్స్ పాయింట్. ఈ చిన్న విషయాన్ని అర్థం చేసుకోవటానికి పాండిత్యం అక్కరలేదు,

డిగ్రీలు అక్కరలేదు. మీకు రెండు హృదయాలు ఉంటే, ఒక హృదయంలో ఈశ్వరుడికి స్థానం ఇచ్చి ఇంకో హృదయంలో లోకానికి స్థానం ఇద్దురుగాని కానీ ఉన్నది ఒకటే! మీలో రెండు హృదయాలు ఉన్నవాళ్ళు ఎవరైనా ఉన్నారా?

ఈ శరీరం నాది. అందిరికీ ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఇది ప్రత్యక్ష ప్రమాణం. దీన్ని ఎలా కాదంటారు? అయితే ఈ శరీరం నిజంగా నాది అయితే ఇది ఎందుకు నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతోంది? మనందరికీ తలలో మెదడు ఉంది. అందుచేత అందరూ ఆలోచించండి. ప్రతిదానికీ మీరు పుస్తకాల దగ్గరికి పరిగెత్తుకు వెళ్ళవలసిన పనిలేదు. ఈ శరీరం మనది అని అనుకొంటున్నాము నిజంగా మనది అయితే మనని విడిచిపెట్టి ఇది ఎందుకు వెళ్ళిపోవాలి? ఈ శరీరం నేను అనుకొంటున్నాము. చివరికి పరిమాణంలో ఇది బూడిద అవుతుంది. నువ్వు ఎవరవు అంటే నేను బూడిద అని చెప్పాలి. ఎందుచేత అంటే ఇది అయ్యేది బూడిదే. అయితే నువ్వు బూడిదవా ఆత్మవా, మనిషి బూడిదా లేకపోతా ఆత్మా? ప్రతి మనిషికి దేహం పడిపోతోంది చూస్తున్నాం. మన ఎదురుగా మనం కళ్ళతోటి చూస్తుంటే అనేక దేహాలు పడిపోతున్నాయి. కానీ దేహాలు పడిపోతున్నప్పుడు, మనస్సులో ఉన్న వాంఛలు ఎందుకు పడిపోవటం లేదు? దేహం రాలిపోయినప్పడు, మన మనస్సులోని సంస్కారాలు కానీ, వాంఛలు కానీ, ఆదర్శాలు కానీ, ఆశయాలు కానీ ఎందుకు రాలిపోవటం లేదు?

నేను నేను అనే శబ్దానికి కానీ ఈ దేహానికి కానీ ఎట్టి సంబంధం లేదు? మనం నేను నేను అంటున్నాం. మనం అనే ఈ నేనుకి ఈ దేహానికి ఎట్టి సంబంధం లేదు? సహనం ఉన్నవాడు ఈ లోకాన్ని జయిస్తాడు. ఎందుకు ఈ లోకాన్ని జయించాలి? లోకాన్ని జయించకపోతే ఆత్మ తెలియబడదు. లోకాన్ని జయించని వాడికి ఆత్మేం తెలుస్తుంది? ఆత్మ తెలియదు. ఒక ఉపనిషత్తులో చెప్పాడు, నీ కుటుంబం కోసం నీ స్వార్థాన్ని విడిచిపెట్టు, నీ గ్రామం కోసం నీ కుటుంబం యొక్క స్వార్థాన్ని విడిచిపెట్టు. నీ రాష్ట్రం కోసం నీ గ్రామం యొక్క స్వార్థాన్ని విడిచిపెట్టు, నీ దేశం కోసం నీ రాష్ట్రం యొక్క స్వార్థాన్ని విడిచిపెట్టు. ప్రపంచం కోసం నీ దేశం మీద నీకున్న ప్రేమని విడిచిపెట్టు. ఆత్మకోసం ప్రపంచం అంతా విడిచిపెట్టు. కనీసం కుటుంబం కోసమైనా నా స్వార్థాన్ని విడిచిపెట్టలేను! ఎక్కడ ఆత్మ? మనం దేశం దాకా వెళ్లొద్దు, ప్రపంచం దాకా వెళ్లొద్దు, ఆత్మ దాకా వెళ్లొద్దు. కనీసం నా కుటుంబం కోసం కూడా నా స్వార్థాన్ని నేను బలిచేయను. ఎందుచేత లోకాన్ని జయించాలి? లోకాన్ని జయించిన వాడికి కానీ ఆత్మ దర్శనం అవ్వదు. ఎవడు జయిస్తాడు లోకాన్ని? దీనికి ఆచార్య స్వాములు వారు అంటున్నారు "ఎవడికైతే సత్యనిష్ఠ ఉందో, ఎవడికైతే సహనం

ఉందో, వాడు ఈ లోకాన్ని జయిస్తాడు. చివరిరోజు వరకూ, చివరి శ్వాసవరకూ, అంతిమ గడియల వరకూ ఎవడైతే సత్యాన్ని విడిచిపెట్టడో, ఎవడైతే సహనాన్ని విడిచిపెట్టడో, వాడినే సత్యం వరిస్తుంది".

మనం ఎన్నో విషయాల గురించి ఆలోచిస్తాం కానీ మన మెదడులో ఉన్న దోషాల గురించి ఆలోచించం, ఇది మాయ. మన శరీరం పడిపోయినప్పుడు, ఇందులో ఒక్క దోషం కూడా రాలదు. ఇది ప్రకృతి యొక్క నియమం. మీరు అర్థం చేసుకొనేటప్పుడు స్పష్టత ఉండాలి. సూటిగా మీరు అర్థం చేసుకోవటానికి, సరళంగా మీరు అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. విషయాన్ని కలగాపులగం చెయ్యకండి, కంగారు పడకండి. సత్యనిష్ఠ ఉన్నవాడు ఈ లోకంలో అదృష్టవంతుడు. వాడే లోకాన్ని జయిస్తాడు అని ఆచార్యులు వారు చెపుతున్నారు. ఒక లోకాన్ని జయించటం కాదు, అంతటితో వాడి ప్రయాణం ఆగదు. లోకాన్ని జయించటంతోనే వాడి ప్రయాణం ఆగలేదు, వాడు ఆత్మని కూడా దర్శిస్తాడు. ఎవడికైతే సహన నిష్ఠ ఉందో, ఎవడికైతే సత్యనిష్ఠ ఉందో, వాడు లోకాన్ని జయిస్తాడు అని చెప్పటం కంటే, వాడి హృదయంలోంచి లోకం జారిపోతుంది, లోకాన్ని జయిస్తాడు అని ఆచార్యులు వారు అంటున్నారు. లోకాన్ని జయిస్తాడు అని చెప్పటం కంటే, వాడి హృదయంలోంచి లోకం జారిపోతుంది. సత్యనిష్ఠ ఉన్న వాడికి అక్కడ జయించటానికి అంటూ ఏమీ లేదు. ఉన్నది ఒక్కటే వస్తువు. అది తానై ఉన్నాడు. ఇంక జయించటానికి ఏముంది అక్కడ? ఎన్ని మతాలలో ప్రవేశించినా, ఎన్ని దేహాలలో తిరిగినా, ఎన్ని దేశాలలో జన్మించినా, ఎక్కడ తిరిగినా, ఎన్ని లోకాలు తిరిగినా, ఎన్ని నదులలో స్నానాలు చేసినా, చివరి జన్మకైనా మీరు ఆత్మ దగ్గరికి రావలసిందే. దేవుడు సత్యం, దేవుడు సత్యం అని చెప్పటం కంటే, సత్యాన్నే దేవుడు అనుకోవటం మంచిది. దేవుడు సత్యం అని చెప్పటం కంటే, సత్యాన్నే దేవుడు అని చెప్పటం ఇంకా బావుంటుంది అని మన జాతిపిత గాంధీజీ చెప్పారు.

మీ హృదయానికి నచ్చిన పని ఒకటి తీసుకోండి, దానికోసం మీ జీవితాన్ని అంకితం చెయ్యండి, హృదయానికి నచ్చింది, మీ మనస్సు మెచ్చింది, ఏదో ఒక మంచి గుణాన్ని మీరు తీసుకోండి, ఒక ఆదర్శాన్ని తీసుకోండి. మొత్తం అన్ని మంచి గుణాలు వద్దు. మీకు నచ్చిన ఒక్క మంచి గుణాన్ని తీసుకోండి, దానికోసం జీవించండి, దానికోసం మరణించండి. మీరు ఎక్కడ ఉన్నా సరే సత్యం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. ఒక్క మంచి గుణం అయినా సరే, దానికోసం జీవించండి, అదే చాలు. దానికి మించిన సాధన అంటూ ఏమీ లేదు. ఇది చిన్న పని అని, పనితో మీరు వివాదం పెట్టుకోనక్కరలేదు. ఇది పెద్ద పని ఇది చిన్న పని

అని, ఇదంతా మనస్సు యొక్క కల్పన. రైలు పెట్టెలతోటి కనుక ఇంజను కలవకపోతే, ఆ పెట్టెలు ఏవిధంగా అయితే కదలవో, దైవానుగ్రహం కనుక మనతోటి కలవకపోతే, మనకి సాధన లేదు, మనకి మోక్షం లేదు, ముక్తి లేదు. రైలు ఇంజను కనుక పెట్టెలతోటి కలవకపోతే, ఆ పెట్టెలు ఏవిధంగా అయితే కదలవో అలాగే దైవానుగ్రహం కనుక వచ్చి మన శిరస్సు మీద పడకపోతే, మన హృదయంలో ప్రవేశించకపోతే, మనకి జీవితంలో పరిణామం లేదు, ప్రగతి లేదు, భవిష్యత్తు లేదు, మోక్షం లేదు. దైవానుగ్రహం మీకు తెలియకుండానే, రహస్యంగా మీలో ప్రవేశిస్తుంది. మీరు శరణాగతి పొందిన రోజున, మీకు సత్యనిష్ఠ కలిగిన రోజున, సహనంగా జీవిస్తున్న రోజున, మీకు తెలియకుండానే వస్తువు ప్రవేశిస్తుంది. అది చాలా రహస్యమైన విషయం. ఎలా ప్రవేశించిందో, అది ప్రవేశించిన తరువాత మళ్ళీ మిమ్మల్ని అడిగినా మీరు చెప్పలేరు. దైవానుగ్రహం మీకు వచ్చిన రోజున, దానికీ మీకూ విడదీయరాని సంబంధం, తెంపటానికి వీలులేని సంబంధం ఏర్పడుతుంది. ఆ అనుగ్రహమే తీసుకెళ్ళి మీచేత ఆత్మ దర్శనం చేయిస్తుంది. అప్పుడు మీ సాధనతోటి, మీ యుక్తులతోటి, మీ జపాలతోటి, మీ పూజలతోటి పనిలేదు. పైపైన చేసే పనులు అవి. మీకు జపాలు పూజలు అవసరమే, కానీ పైపైన చేసే పనులు అవి.

ఎవడికైతే దయగల హృదయం ఉందో, వాడికి దేవతలు కూడా నమస్కరిస్తారు. దయగల హృదయం ఎలా ఉంటుందో, దానిని ఎప్పుడైనా మనం చూసామా? కొంతమంది మానవరూపంలో ఉన్నప్పటికీ, పశులక్షణాలు ఉంటాయి, శరీరం అయితే, మానవ శరీరం ఉంటుంది, కానీ లక్షణాలు అన్నీ పశులక్షణాలు ఉంటాయి. అసలు హృదయం అంటే ఎలా ఉంటుందో, మనస్సు అంటే ఎలా ఉంటుందో, దైవం అంటే ఎలా ఉంటుందో, దయ అంటే ఎలా ఉంటుందో, ఇవేమీ తెలియకుండానే ఆ శరీరాలు రాలిపోతాయి. ఎవడికైతే దయగల హృదయం ఉందో వాడు మహాత్ముడు, దయగల హృదయంలేని వాడు మహాత్ముడు కాదు, వాడు దురాత్ముడు.

భగవంతుడికి గుడులు కడతారు. సిమెంటుతోటి ఇటుకలతోటి కట్టే గుడులు బయట గుడులు అవి నిజంకాదు. సిమెంటుతోటి ఇటుకలతోటి కట్టేవి బాహ్యమైన గుడులు. మీ హృదయంలో కనుక దయ ఉంటే, ఈశ్వరుడే మీ హృదయంలో గుడి కట్టుకొని అక్కడ కాపురం ఉంటాడు. దానికి ఇటుకలతోటి పని లేదు, సిమెంటుతోటి పని లేదు, ఒక దయచాలు అన్నారు ఆచార్యులు వారు. ఒక బీదవాడిని చూస్తే మన హృదయం ద్రవించిన సందర్భం ఎప్పుడైనా ఉందా? ఒక్కసారి మీరందరూ వెనక్కి తిరగండి మీ జీవితాలలో. మనందరికీ నలభై సంవత్సరాలో, యాభై సంవత్సరాలో, అరవై సంవత్సరాలో, డబ్భై సంవత్సరాలో వచ్చినాయి.

ఒక్కసారి వెనక్కి తిరిగి మీ జీవితం నెమరువేసుకోండి. మనం జీవించిన జీవితంలో ఎప్పుడైనా మనం బీదవాడిని చూసి హృదయం ద్రవించిన సంఘటనలు కనీసం ఒక్క సంఘటన ఉందా? ఒకసారి మీ మనస్సుని వెనక్కి తిప్పుకోండి జీవితంలో. ఇంత కాలం జీవించాం మనం, మన హృదయంలో ఎప్పుడైనా దయ అనేది కలిగిందా. ఏ సందర్భంలో అయినా ఎప్పుడైనా ఎక్కడైనా కలిగిందా అని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోండి. అందుకే కొంతమంది అన్నారు ఈ మనుషులని ప్రార్థించటం కంటే, గుళ్ళో ఉన్న రాళ్ళను ప్రార్థించటం మంచిది. కొంతమంది మనుషుల మీద రాళ్ళే మెరుగు, గుళ్ళో రాయి మీకేమనిపిస్తుందని ప్రార్థిస్తున్నారు అని కొంతమంది అడగవచ్చు. చాలామంది మనుషుల కంటే గుళ్ళో రాయి మెరుగు. ఆ రాయి కంటే ఈ రాళ్ళకి మరీ అసలు ఆర్ద్రత కలుగదు. మద్రాసులో మీ విగ్రహం చేయిస్తున్నారు. మీ విగ్రహం ఇంకొద్ది రోజులలో అరుణాచలం రాబోతున్నది అని భగవాన్‌తో చెప్పారు. అప్పుడు భగవాన్ అన్నారు ఈ రాతి మనుషులు అందరికీ రాతి దేవుళ్ళు ఉండాలి అన్నారు.

ఈ శరీరాన్ని నేను అనుకొంటున్నాం, అందుకే గుళ్ళో రాయిని పెట్టి దేవుడు అన్నారు, గుళ్ళో రాయిని దేవుడు అంటే నువ్వు ఆక్షేపిస్తున్నావు, ఈ శవాన్ని నువ్వు అనుకొంటున్నావు, గుళ్ళో రాయిని దేవుడు అనుకొన్నప్పుడు నువ్వు ఆక్షేపించేటప్పుడు, నీ శరీరం శవమే, మరి ఈ శవాన్ని చూసి ఎందుకు ఆక్షేపించుకోవు? ఎందుకు ఆశ్చర్యపడవు? గుళ్ళో రాయిని దేవుడు అంటున్నారని నువ్వు ఆశ్చర్యపోతున్నావు. నీ శరీరం శవమే కదా! కానీ ఈ శవాన్ని నువ్వు అనుకొంటున్నావు. గుళ్ళో ఉన్న రాయిని చూసి ఆశ్చర్యపోయే నువ్వు, నీ శవాన్ని చూసి నువ్వు ఎందుకు ఆశ్చర్యపడవు? ఈ శవాన్ని నువ్వు అనుకొంటున్నావు కదా! నీ శవాన్ని నువ్వు అనుకొన్నప్పుడు ఆ రాయి దేవుడు అన్నా ఆక్షేపణ లేదు అన్నారు భగవాన్.

బీద ప్రజలని చూసి, దిక్కులేని వాళ్ళని చూసి ఎవరి హృదయం అయితే ద్రవిస్తుందో వాళ్ళు ఈ లోకంలో మహాత్ములు అని నేను అంటాను అని స్వామీజీ చెప్పారు. "హూమ్ ఐ కాల్ ఎ మహాత్మా, హూజ్ హార్ట్ బ్లీడ్స్ ఫర్ ది పూర్". ఇరుకైన హృదయాలలో కానీ, ఇరుకైన జీవితాలలో కానీ ఈశ్వరుడు ప్రవేశించడు. కొంతమంది మనస్సులు చాలా ఇరుగ్గా ఉంటాయి, కొంతమంది హృదయాలు చాలా ఇరుగ్గా ఉంటాయి. ఇరుకైన జీవితంలోకి రావటానికి ఈశ్వరుడికి ఎట్టిపరిస్థితులలోనూ అవకాశం లేదు. ఈనాటికైనా, వచ్చేనాటికైనా, ఈ జన్మకైనా, మరొక జన్మకైనా వచ్చే అవకాశం కనబడదు. మన మనస్సులో ఇరుకు పోవటానికి మన హృదయంలో ఇరుకు పోవటానికి ప్రార్థన పెట్టారు. ప్రార్థన అందుకు పెట్టారు, పూజ అందుకు పెట్టారు, జపం కూడా అందుకే. దయగల హృదయంలోనే

భగవంతుడు కాపురం ఉంటాడు. భగవంతుడి ఇల్లు ఎక్కడ అంటే, దయగల హృదయంలోనే భగవంతుడు ఉంటాడు.

సూరదాసు పూర్వజన్మలలో ఎంత సాధన చేసి వచ్చాడో, వాళ్ళ అమ్మ చిన్నప్పుడు కొనుక్కోమని డబ్బులు ఇచ్చేది. ఆ డబ్బులు జేబులో పెట్టుకొని బళ్ళోకి వచ్చేటప్పుడు, చిన్న చిన్న చేపలు పట్టుకొనేవాళ్ళు ఎవరైనా కనిపిస్తే ఆ చేపలు బేరం ఆడేవాడు ఆయన. జేబులో ఎన్ని డబ్బులు ఉంటే అన్ని డబ్బులకి చేపలు కొనేవాడు. ఆ చేపలని పట్టుకెళ్ళి చెరువులో వదిలేసేవాడు. ఏ కాలేజీలో నేర్చుకున్నాడు, ఏ హైస్కూల్లో నేర్చుకున్నాడు, ఏ యూనివర్శిటీలో నేర్చుకున్నాడు? వాడికి పుట్టుకతోటి వచ్చింది ఆ దయ గల అంతఃకరణం. నేను ఏం కట్టుకొంటున్నాను అని కానీ, ఏం తింటున్నాను అని కానీ, నా జీవితంలో ఎప్పుడూ ఆలోచించ లేదు అన్నాడు. నేను చేసిన తపస్సు లేదు. నేను ఏదైనా తపస్సు అంటూ చేసి ఉంటే, అదే తపస్సు అని చెప్పాడు. ముఖమల్ గుడ్డ ఎంత మెత్తగా ఉంటుందో, కొంతమంది హృదయాలు అంత సంస్కరింపబడి ఉంటాయి. హృదయంలో సంస్కారం లేకుండా, హృదయంలో సున్నితమైనటువంటి స్థితి లేకుండా, ఈశ్వరుడు అక్కడ ఆవిష్కరింపబడడు.

మనం ఇల్లు దులుపుకుంటాం, కానీ మన మనస్సులో ఉన్న దుమ్ము దులుపుకోము. ఇంటిలో ఉన్న దుమ్ముని చూస్తే మనకు కంగారు పుడుతుంది దుమ్ము అంతా ఇలా ఉందేంటి అని. కానీ మనస్సులో ఉన్న దుమ్ము గురించి చూసుకోము. దాన్ని దులుపుకోవటానికి ప్రయత్నం చెయ్యం. శరీరానికి ఇచ్చే ప్రాముఖ్యత కూడా, మనస్సుని బాగు చేసుకోవటానికి ఇవ్వటం లేదు. భక్తియోగం, జ్ఞానయోగం, కర్మయోగం, ఈ యోగాల వల్ల ప్రయోజనం ఏంటి? యోగం వల్ల శక్తి వస్తుంది, శక్తి వల్ల జ్ఞానం పుడుతుంది. జ్ఞానంతోటి మనకి శాంతి ఆవిష్కరింపబడుతుంది. జ్ఞానం లేకపోతే ప్రకాశం లేదు.

సంసారంలో ఉన్న దోషాలు వివేకంలేని వాడికి కనబడవు. సంసారంలో ఉన్న దోషాలు వివేకవంతుడు చూస్తూ ఉంటాడు. బుద్ధిమంతుడు చూస్తూ వుంటాడు. ఆ దోషాలలోంచి బయటపడటానికి ప్రయత్నం చేస్తాడు. వివేకం లేనివాడు అసలు వాడు దోషంలో ఉన్నాము అన్న సంగతి కూడా తెలియకుండా వాడి జీవితం రాలిపోతుంది. ఇక్కడ చెప్పకొంటున్నది ఈ స్థంభం కూడా వింటోంది. ఈ స్థంభం ఎంత అభివృద్ధి అవుతోందో, కొంతమంది మనుషులు కూడా అంతే అభివృద్ధి అవుతారు ఎంత విన్నా సరే. కొంతమంది మనుషులు ఈ స్థంభాలలా ఉంటారు. ఈ స్థంభం మన గోల వింటోంది కదా! ఏం మార్పు వచ్చింది దాంట్లో, ఏమైనా వికాసం పొందిందా? కొంతమంది మనుషులు కూడా అంతే.

మీరు ఏదైనా సరే నిజం చెపుతున్నప్పటికీ అది అప్రియంగా మట్టుకు చెప్పకండి.

మీ ఇంటిలో విషయాలు అయినా సరే, మీరు నిజం చెపుతున్నప్పటికీ అది హితవుగా ఉండాలి, ప్రీతిగా ఉండాలి, సొంపుగా ఉండాలి, ఇంపుగా ఉండాలి, అందంగా చెప్పాలి. నిజం చెపుతున్నాము కదా అని నోటికి వచ్చినట్టు చెప్పకూడదు. కొంతమంది నిజమే చెపుతున్నాము అని రెక్లెస్‌గా చెపుతారు. ఒక క్రమబద్ధం లేకుండా చెపుతారు. క్రమశిక్షణ లేకుండా చెపుతారు. మీరు నిజం చెపితే చాలదు. నిజాన్ని ప్రీతిగా చెప్పాలి, హితవుగా చెప్పాలి, ఎదుటివాళ్ళకి అర్థం అయ్యేలా చెప్పాలి. చాలామంది, మేము నిజం చెపుతామండీ, మేం అబద్ధం చెప్పమండి అంటారు అదొక రకమైన అహంకారం అందుకే అది ప్రధానం కాదు. మీరు చెప్పేది నిజం అయినప్పటికీ క్రమపద్ధతిగా ఒక క్రమశిక్షణతో చెప్పాలి. ఆపరేషన్ చేసేటప్పుడు మత్తుమందు పెడతారు, బాధ తెలియకుండా ఉండటం కోసం. అలాగే మీరు చెప్పే నిజం కూడా ఎదుటివాడికి బాధ కలుగచెయ్యకూడదు. వాడు అక్కడ బాగుపడాలి. వాడికి సలహా రూపంలో చెప్పాలి, హితవుగా చెప్పాలి.

మాటలు మనుషులని దూరం చేసేస్తాయి. మాటలు ఇళ్ళకు నిప్పు పెడతాయి, మాటలు ఇళ్ళని కలుపుతాయి. మాటలు కూడా అగ్గిపుల్లల లాంటివి. అగ్గిపుల్లలతోటి మనం ఇంటికి నిప్పు పెట్టుకోవచ్చు, పొయ్యిలో నిప్పులు వేసుకొని అన్నం వండుకోవచ్చు. మాటలు కూడా అటువంటివే. మాటల వల్ల అనేక సంసారాలు, కాలిపోయిన సంసారాలు ఉన్నాయి. మాటల దగ్గర జాగ్రత్తగా ఉండాలి. ఆలోచించి మాట్లాడాలి. పూర్వం నుంచీ మన పెద్దలు చెపుతారు, కాలు జారితే తీసుకోవచ్చు కానీ మాట జారితే తీసుకోలేము. మనందరిలో ఉన్న లోపం, బలహీనత, ఏమిటంటే ముందు మాట్లాడతాం, తరువాత ఆలోచిస్తాం. కానీ మన పెద్దలు ఏమి చెప్పారంటే, ముందు ఆలోచించండి, తరువాత మాట్లాడండి. నిజం చెపుతున్నాం కాబట్టి మీ ఇష్టం వచ్చినట్టు చెప్పకూడదు అని చెపుతున్నాడు శాస్త్రంలో. హితవుగా చెప్పమన్నాడు, ఎదుటివాడికి నొప్పిపెట్టకుండా చెప్పమన్నాడు, వాళ్ళు బాగుపడే రీతిలో చెప్పమన్నాడు, అది నిజమైనా సరే.

కొన్ని హృదయాలని కూడా మర్చిపోలేము. అలాగే కొంతమంది స్మృతులని కూడా మర్చిపోలేము. అలాగే కొంతమంది జీవితాలని కూడా మర్చిపోలేము. ఇవాళ భగవాన్ ఎక్కడి వాడు. ఎక్కడో కొండమీద కూర్చున్నవాడు. ఆయన చెప్పిన మాటలు నదులు దాటాయి, ఊళ్ళు దాటాయి, సముద్రాలు దాటాయి, ఖండాలు, దేశాలు దాటాయి. మరి మన మాటలు ఎక్కడికీ వెళ్ళటంలేదు, జీవుడిని దాటి ఎక్కడికి వెళ్ళటం లేదు. మన మాటలకి శక్తి లేదు. భగవాన్ మాటలు కానీ, అరవిందుడి మాటలు కానీ, దేశాలు దాటి, సముద్రాలు దాటి ఎంత దూరం ప్రయాణం చేసాయో మరి మన మాట ఎక్కడికీ కదలదే! ఇంజనుకి తగిలించని

పెట్టెలుగా ఉన్నాయి మన మాటలు. మీ శరీరానికి ఏవిధంగా అయితే శక్తి ఉందో, అదేవిధంగా మీ మాటకి శక్తి ఉంది, మీ భావనకి శక్తి ఉంది, మీ తలంపుకి శక్తి ఉంది, మీ ఊహలకి శక్తి ఉంది, మీ ఆలోచనకి శక్తి ఉంది, మీ ఆదర్శానికి శక్తి ఉంది. క్రమబద్ధం కాని జీవితాలు, ఒక ఆదర్శం కోసం జీవించని జీవితాలతోటి మనకి సహవాసం పనికిరాదు. వాళ్ళు ఎంత దగ్గరివాళ్ళు అయినా సరే, ఎంత సన్నిహితులు అయినా సరే, స్నేహితులు అయినా సరే, సాధ్యమైనంత వరకూ వాళ్ళకి దూరంగా ఉండటం మంచిది. ఎండ్రిన్ మన ఇంట్లో ఉంది, మన సొంతమే, అయితో నోట్లో వేసుకుంటామా? అయితే మనకి ఎంత దగ్గరి వాళ్ళు అయినాసరే, వాళ్ళకి క్రమశిక్షణ లేకపోతే మనం దూరంగా ఉండవలసిందే. ఎందుచేతనంటే మన హృదయంలో ఉన్న ఆత్మని మనం తెలుసుకోవటం కోసం.

పూర్వం అనేకసార్లు చెప్పాను. మరొకసారి నేను చెపుతున్నాను ధైర్యం లేనివాడికి ఆత్మ దర్శనం అవ్వదు. అసలు ఆత్మ గురించి చెప్పటం కంటే, మనిషికి ధైర్యం గురించి ఎక్కువ చెప్పటం మంచిదేమో అని నాకు అనిపిస్తోంది. ధైర్యంలేనివాడు స్వతంత్రంగా జీవించలేడు. ధైర్యం లేనివాడు ఆనందంగా మరణించలేడు, శాంతిగా మరణించలేడు, సంతోషంగా మరణించలేడు. ధైర్యం లేనివాడికి ఆత్మ దర్శనం కాదు. మీరు ఏమీ చెయ్యక్కరలేదు, మీ అంతట మీరు ధైర్యంగా ఉండండి. మిమ్మల్ని చూసి మేము నేర్చుకుంటాము. ధైర్యంలేనివాడు స్వతంత్రంగా జీవించలేడు, వాడు పారమార్థిక జీవితానికి అసలే పనికిరాడు. అన్ని రోగాలకీ ఒకటే మందు ఉంది, అది ధైర్యం అని భీష్మాచార్యులు వారు చెప్పారు. ధైర్యానికి మించిన మందు లేదని భీష్ముడు చెప్పాడు. వివేకానందుడు ఎప్పుడు చెప్పినా ఉపన్యాసం, ప్రారంభంలో 'బి ఫియర్లెస్' అంటే నిర్భయంగా ఉండు, భయం లేకుండా ఉండు. మళ్ళీ ఉపన్యాసం ముగించే ముందు కూడా 'బి ఫియర్లెస్' అనేవాడు. అంటే భయం లేకుండా ఉండు, ప్రారంభించేటప్పుడు భయం లేకుండా ఉండు అనేవాడు, ముగించేటప్పుడు కూడా 'బి ఫియర్లెస్' అనేవాడు. మనలో ఉన్న అన్ని బలహీనతలకి భయం కారణం, మనలో ఉన్న రోగాలకి భయం కారణం, మనం చచ్చిపోవటానికి భయం కారణం, మనం పుట్టటానికి భయం కారణం, మనలో ఉన్న లోటుపాట్లు అన్నిటికీ భయం కారణం. జీవితంలో అన్ని సమస్యలకి భయం కారణం. అందుచేత భయం లేకుండా ఉండు.

మీరు పుణ్యం చేసినా పాపం చేసినా సరే, శరీరంతోటి చెయ్యాలి, మాటతోటి చెయ్యాలి, మనస్సుతోటి చెయ్యాలి. పాపం తెచ్చేది పుణ్యం తెచ్చేది ఈ శరీరమే, మీ మాటే, ఈ మనస్సే. ఈ మూడే పాపం చేస్తున్నాయి, ఈ మూడే పుణ్యం చేస్తున్నాయి. మనకి పుణ్యం తెచ్చిపెట్టేవి ఇవే. మనకి పాపం తెచ్చిపెట్టేవి ఇవే. అయితే ఈ మూడింటిని ఎవడైతే

ఈశ్వరుడికి అర్పించాడో వాడు జ్ఞాని. అందరికీ ఒక శరీరం ఉంది, మాట ఉంది, మనస్సు ఉంది. ఎవడైతే ఈశ్వరుడికి ఈ మూడింటిని అర్పిస్తున్నాడో వాడు జ్ఞాని అవుతాడు. మీరు పుణ్యం సంపాదించుకోవాలన్నా వీటిల్ని ఉపయోగించుకోవలసిందే - మీ శరీరాన్ని, మీ మనస్సుని, మీ వాక్కుని ఉపయోగించుకోవలసిందే పుణ్యం సంపాదించుకోవటం కోసం.

కొంతమంది అనవసరమైన మాటలు మాట్లాడి పాపం తెచ్చుకుంటారు. మనమేదైనా ఒక మాట మాట్లాడేటప్పడు అవసరమైన దానికంటే ఎక్కువ చెప్పకూడదు, చెప్పవలసిన దానికంటే తక్కువ చెప్పకూడదు. అది వివేకవంతుడి లక్షణం. ఏదైనా ఒక విషయం గురించి మనం మాట్లాడేటప్పడు, అవసరమైన దానికంటే ఎక్కువ చెప్పకూడదు, అవసరమైన దానికంటే తక్కువ చెప్పకూడదు. ఎక్కువ మాటలు చెప్పటం వల్ల కూడా కొన్ని పాపాలు అంటుకోవచ్చు. కొంతమంది అతిశయోక్తిగా చెపుతారు. జరిగింది కొంచెం అయితే, దానిని పెద్దది చేసి, అతిశయోక్తిగా చెపుతారు. విషయం చిన్న విషయం, దానిని పెద్దది చేసి ప్రచారం చేస్తారు. పాపం పోగుచేసుకుంటున్నాము, పాపం మూటగట్టుకుంటున్నాము అని వారికి తెలియదు. మనం శరీరంతో చేసే పని ద్వారా పుణ్యం వస్తుంది, పాపం వస్తుంది. మనం మనస్సుతోటి చేసే ఊహల ద్వారా పాపం వస్తుంది, పుణ్యం వస్తుంది. ఈ శరీరాన్ని, వాక్కుని, మనస్సుని ఎవడైతే పవిత్రంగా ఉంచుతున్నాడో వాడే జ్ఞాని అవుతాడు. నిజం చెపుతున్నాము అనుకొన్నప్పటికీ దానిని హితవుగా చెప్పండి, ఎదుటివాళ్ళకి మేలు కలిగేటట్టు చెప్పండి, ప్రీతిగా చెప్పండి, ఎదుటివాడికి నొప్పి లేకుండా చెప్పండి, వాళ్ళ మనస్సుకి హద్దుకొనేటట్టు చెప్పండి. నిజం చెపుతున్నామని క్రమశిక్షణ లేకుండా, క్రమబద్ధం లేకుండా చెప్పకండి అని ఆచార్యులు వారు చెపుతున్నారు.

భగవాన్ శరీరం ఇక్కడ లేదు, భగవాన్ చెప్పిన మాటలు ఇక్కడ ఎందుకు చెప్పకొంటున్నాము మనం? మాటలకి శక్తి లేకపోతే? మాటలకి జ్ఞానం లేకపోతే? మన ఇంటిలో వాళ్ళ మాటలు స్మరించుకోవచ్చును కదా? లేకపోతే మన ఊళ్ళో వాళ్ళ మాటలు స్మరించుకోవచ్చు కదా? మధ్వాచార్యులు వారు ఒక మాట చెప్పారు 'భగవంతుడు లేడు భగవంతుడు లేడు భగవంతుడు లేడు అనే మనిషి ఎవడైనా మిమ్మల్ని తరుముకు వస్తూ ఉంటే, మీరు వెళ్ళి వాడి చేతిలో పడటంకంటే, మీరేదైనా పులి నోట్లో పడితే నేనుసంతోషిస్తాను' అన్నాడు. మీరు పులి నోటిలో పడితే ఆ శరీరమే పోతుంది, ఆ జన్మే పోతుంది. వీడి చేతిలో పడితే భవిష్యత్తు జన్మలు కొన్ని నీచ జన్మలు వస్తాయి మీకు. పులి నోట్లో పడితే ఆ శరీరం ఒకటే పోతుంది, ఈ సహవాసం వల్ల అలా కాదు, భవిష్యత్తులో మీకు అనేకమైన నీచ జన్మలు రావటానికి ఈ స్నేహం కారణం అవుతుంది. అందుచేత వీడి చేతిలో పడటంకంటే

పులి నోట్లోపడండి, నేను ఎక్కువ సంతోషిస్తాను అని చెప్పాడు మధ్వాచార్యులు. ఎంత అందంగా చెప్పాడో చూడండి. అతని హృదయంలో మన మీద ఎంత ప్రీతి దాచుకొని చెప్పాడో చూడండి.

మనం నేర్చుకున్న విషయాలని, మనం చేతనైనంత వరకు ఆచరణలో పెట్టలేకపోతే, ఇవన్నీ పడకకుర్చీ వేదాంతం, మెట్టవేదాంతం అంటారు. భోజనాలు చేసాక పడకకుర్చీలో కూర్చుని కాలక్షేపం కబుర్లు చెప్పకుంటారు, అటువంటి వేదాంతం అంటారు. ఒక స్త్రీకి గర్భం వచ్చింది, పురుడు రావటం లేదనుకోండి, గర్భంలో ఏదో దోషం ఉన్నట్లు. అదేవిధంగా మనం అన్ని విషయాలు తెలుసుకొంటున్నాము అనుకోండి, ఒకటీ ఆచరణలో పెట్టలేకపోతున్నాము అనుకోండి, మనదీ అదే పరిస్థితి. మనమేదైతే నమ్ముతున్నామో, ఏదైతే విశ్వసిస్తున్నామో వాటిని నిజంగా నమ్మటం లేదు, నిజంగా విశ్వసించటంలేదు. మన మనస్సు నమ్ముతున్నట్టుగా మన మనస్సు విశ్వసిస్తున్నట్టుగా నటిస్తోంది. అది మనలో ఉన్న లోపం. మనం ఏదైతే నమ్ముతున్నాము అని అనుకుంటున్నామో, అది నమ్మటం లేదు, మన మనస్సు నమ్ముతున్నట్టు నటిస్తుంది. అది కూడా నటనే. మనకు జీవితం పొడుగునా నటనే, ధ్యానం వ్యాపారం, కొబ్బరికాయ వ్యాపారం, వ్యాపారం కాదు మన జీవితం కూడా ఒక వ్యాపారమే. జీవితాన్ని కూడా వ్యాపారం కింద జీవిస్తున్నాము.

మనమంతా భగవంతుడిని ప్రేమిస్తున్నాము. భగవంతుడి యందు మనకి ఆప్యాయత ఉంది అని మనం అనుకోవచ్చు. కానీ ఒక్కసారి మన హృదయాంతరాలలో చూసుకుంటే మనకి విశ్వాసం లేదని, భక్తి లేదని, ఒకవేళ ఉన్నా అది అల్పమైనది, స్వల్పమైనది అని మనకి తెలుస్తుంది. కొంతమందికి దూరదృష్టి ఉంటుంది, దూరదృష్టి ఉన్నవాళ్ళకంటే, లోపలిదృష్టి ఉన్నవాళ్ళు గొప్పవాళ్ళు. దూరదృష్టి కూడా మంచిదే, దూరదృష్టి కూడా అవసరమే. వాడు ప్రాపంచికంగా తెలివితేటలుగా జీవించటానికి వాడి దూరదృష్టి ఉపయోగపడవచ్చును. నేను కాదనటంలేదు, కానీ దూరదృష్టి ఉన్న వాడికంటే లోపలదృష్టి ఉన్నవాడు గొప్పవాడు, మహాత్ముడు. ఎందుచేతనంటే లోపలిదృష్టి ఉన్నవాడికి ఆత్మదర్శనం అవుతుంది కానీ, కేవలం దూరదృష్టిఉండటం వల్ల ఆత్మ దర్శనం కాదు. అందుచేత దూరదృష్టి కంటే లోపలిదృష్టి చాలా గొప్పది. ఎవడికైతే లోపలిదృష్టి ఉండదో వాడు సంసారాన్ని కూడా సరిగ్గా లాగలేడు. ఎక్కడికైనా వెళ్ళాలంటే డబ్బు ఉండాలి, దేహానికి సంబంధించిన యాత్ర వరకూ డబ్బు ఉండాలి. తినటానికి డబ్బు ఉండాలి. బట్టలు కట్టుకోవటానికి డబ్బు ఉండాలి. డబ్బు అవసరమే జీవితానికి. సన్యాసికి డబ్బుతోటిపనిలేదు, భగవానుకి అయితే డబ్బుతోటి పని లేదు. కానీ మనమూ పనిలేదు అనుకుంటే ఎలాగ? సన్యాసికి నిజంగా డబ్బుతోటి పనిలేదు, కానీ

గృహస్తుకి డబ్బు అవసరమే. తినటానికి అవసరమే, తిరగటానికి అవసరమే, రోజూ ఏ పని చేయటానికైనా అవసరమే. అయితే సాధ్యమైనంతవరకూ న్యాయబద్ధంగా సంపాదించాలి. గీతలో ఏం చెప్పారంటే, నీ దేహానికి, నీ కుటుంబయాత్రకి సరిపడ సంపాదించు అని చెప్పాడు.

వైష్ణవ సాంప్రదాయంలో ఆళ్వారులు ఏం చెపుతారంటే, నాకు ఎక్కువ ధనాన్ని ఇవ్వొద్దు, అసలు ఆకలితోటి బాధపడేటట్టు చెయ్యొద్దు, ఎక్కువ ధనాన్ని ఇస్తే ధనం గురించి మనస్సు ఆలోచిస్తుంది, ఆకలితోటి బాధపడే రోజు నాకు ఉంటే, నిన్ను మరిచిపోయి అన్నం గురించి ఆలోచిస్తుంది. ఈ పరిస్థితి తీసుకురావద్దు, ఆ పరిస్థితి తీసుకురావద్దు. ఈ లోకంలో కొంతమందికి ఆకలిబాధ, కొందరికి అజీర్తి బాధ. వైష్ణవ సాంప్రదాయంలో ఏం చెప్పారంటే, మాకు ఆకలి బాధ కలుగజేయకు, ఎందుచేతనంటే ఆకలితోటి ఉంటే నిన్ను స్మరించలేము. ఐశ్వర్యములోను ముంచేయకు. ఐశ్వర్యములో ముంచేస్తే నిన్ను మర్చిపోయి అస్తమానూ ఐశ్వర్యం గురించి ఆలోచిస్తుంటాము. అందుచేత మధ్యేమార్గాన్ని మనకి ప్రసాదించింది వైష్ణవ సాంప్రదాయం. వాళ్ళు మధ్యేమార్గం అంటారు దానిని. సాధ్యమైనంత వరకూ న్యాయమార్గంలో సంపాదించటానికి ప్రయత్నం చెయ్యాలి. సంపాదన అవసరమే, అయితే న్యాయమార్గంలో ఉండాలి.

గుడ్డివాడు ఎవడు? మనం కళ్ళు లేనివాడు గుడ్డివాడు అనుకొంటున్నాము. ఆచార్యులువారు చెప్పేది ఏమిటి అంటే ఎవడైతే చెడ్డ మట్లాడుతున్నాడో, ఎవడైతే చెడ్డ స్మరిస్తున్నాడో, ఎవడైతే చెడ్డ చేస్తున్నాడో వాడు గుడ్డివాడని, మనము అనుకొనేవన్నీ విరుద్ధంగా చెపుతున్నారు ఆచార్యులువారు. మనం గుడ్డివాడంటే కళ్ళు లేనివాడు గుడ్డివాడు అనుకొంటున్నాము, ఆచార్యులు వారు ఏం చెపుతున్నారంటే, చేతులతోటి ఎవడైతే చెడ్డ చేస్తున్నాడో, కళ్ళతోటి ఎవడైతే చెడ్డ చూస్తున్నాడో, చెవులతోటి ఎవడైతే చెడ్డని వింటున్నాడో, ఎవడైతే చెడ్డని స్మరిస్తున్నాడో, వాడు గుడ్డివాడు అని చెపుతున్నారు ఆచార్యులువారు.

సోదరమహాశయులారా! మీకొక రహస్యం చెపుతున్నాను. కొంతమందికి ఎవడైనా చెడ్డ చెపుతుంటే చెవుల్లో తేనె పోసినట్టు ఉంటుంది. మనకి నోటిలో క్షీరాన్నం పోసుకుంటే ఎలా ఉంటుందో, కొంతమంది ఎవరైనా చెడ్డ మాటలు చెపుతుంటే చెవుల్లో తేనె పోసినట్టుగా అంత శ్రద్ధగా వింటారు, మళ్ళీ చెప్పండి, మళ్ళీ చెప్పండి, అని ఎంతో శ్రద్ధగా వింటారు, లోపల దుర్మార్గపు వాసన ఉంటుంది వాళ్ళకి. ఆ చెడ్డ వింటే లోపల వాళ్ళకి సంతోషం వస్తుంది, ఆ సంతోషాన్ని తట్టుకోలేక మళ్ళీ చెప్పండి, మళ్ళీ చెప్పండి అంటారు. లోపల దుర్మార్గం ఉంది, లోపల చెడ్డ ఉంది కాబట్టి అస్తమానూ చెడ్డ వినాలనిపిస్తుంది. వాళ్ళు పరమ నికృష్టులు, పరమ దుర్మార్గులు. తరువాత వాళ్ళకి మంచి జన్మలు రావు, పంది జన్మలు వస్తాయి. మనం

ఏదైనా మంచి చెపితే శ్రద్ధగా వినరు, చెడ్డ చెపితే మళ్ళీ చెప్పండి మళ్ళీ చెప్పండి అంటారు. మీకెప్పుడైనా అలాంటి మనుషులు తగులుతూ ఉంటారు.

మీ జీవితంలో జరిగే సంఘటనలు, మీ ఇంట్లో జరిగే సంఘటనలు, మీ బంధువుల తోటి మీ స్నేహితులతోటి మీకు ఎదురయ్యే సంఘటనలు, సమాజంలో మనుషులతోటి మీకు ఎదురయ్యే సంఘటనలను మీ బుద్ధిని ఉపయోగించి, మీ బుద్ధికి పని చెప్పి, జాగ్రత్తగా పరిశీలించటం నేర్చుకుంటే, గొప్ప డిగ్రీలు పుచ్చుకున్నవాళ్ళు కూడా మీ దగ్గర కూర్చోవటానికి పనికిరారు, పక్కన కూర్చోవటానికి కూడా పనికిరారు. పరిశీలన ఒక్కటే నేర్చుకోండి మీరు, చాలు. నేను మాట్లాడుతున్నాను అనుకోండి, నేను ఏ ఉద్దేశంతోటి మాట్లాడుతున్నాను, ఏ హృదయంతోటి మాట్లాడుతున్నాను, ఏ తపనతోటి మాట్లాడుతున్నాను, అది కూడా మీరు పరిశీలించుకోండి. పరిశీలన లేకుండా మీరు ఒక్క మాట కూడా తీసుకోవద్దు. చివరికి భగవాన్ చెప్పినా సరే, ఈశ్వరుడు చెప్పినా సరే, పరిశీలనలో పెట్టుకోండి.

కొందరికి లోపల హృదయంలో చెడ్డ ఉంది కాబట్టి, వాళ్ళు చెడ్డ వినటానికి సంతోషపడతారు. చెడ్డ చెపుతూ ఉంటే కొంతమంది ఇంకా చెప్పండి, ఇంకా చెప్పండి అంటారు. అంటే ఏమిటి? చెడ్డ వింటే కూడా సంతోషం వస్తూ ఉంటే వాడు కూడా పాపి అని భతృహరి చెప్పాడు. కొంతమంది వాళ్ళకేమీ కలిసిరాకపోయినా, ఎదుటివాళ్ళు చేసుకొనే మంచి పని చెడగొట్టేస్తారు. పోనీ వాళ్ళకి కలిసివస్తే వాళ్ళ స్వార్థం కోసం అనుకోవచ్చు, వాళ్ళకి కలిసి రాకపోయినా ఎదుటివాళ్ళు ఏదైనా మంచి పని చేసుకుంటూ ఉంటే దానిని చెడగొట్టేయటానికి చూస్తారు కొంతమంది మనుషులు. ఆ మనుషులని మూర్ఖులు అనాలో, నీచులు అనాలో, వాళ్ళకేమి పేరు పెట్టాలో నాకు అర్థం అవ్వటం లేదు అని భతృహరి చెప్పాడు.

మన ఇంట్లో కృష్ణుడి పటం పెట్టుకొంటున్నాం, భగవాన్ పటం పెట్టుకొంటున్నాం, గాంధీగారు పెట్టుకొనేది రాముడి పటం కాదు, భగవాన్ పటం కాదు, కృష్ణుడి పటం కాదు, మూడు కోతుల బొమ్మ ఎప్పుడూ ఎదురుగా పెట్టుకునేవారు. ఆ మూడు కోతుల బొమ్మలో ఒక కోతేమో కళ్ళు మూసుకుంటుంది, ఒక కోతేమో చెవులు మూసుకుంటుంది, ఒక కోతేమో నోరు మూసుకుంటుంది. నోరు మూసుకునే కోతి కూడా గాంధీగారికి గురువు అంట, చెడ్డ మాట్లాడకండి. కళ్ళు మూసుకునే కోతి కూడా గాంధీగారికి గురువు అంట, చెడ్డ చూడకండి. చెవులు మూసుకునే కోతి కూడా గాంధీగారికి గురువు అంట, చెడ్డ వినొద్దని. ఈ మూడు కోతులు నాకు గురువులు అని గాంధీగారు చెప్పారు.

సహజంగా జీవించటం వల్ల మీ ప్రయత్నం తోటి నిమిత్తం లేకుండా మీ సాధన తోటి నిమిత్తం లేకుండా ఈశ్వరుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. మీ జీవితం సహజంగా ఉ

ంటే చాలు, సరళంగా ఉంటే చాలు జ్ఞానమనే కిరీటాన్ని తీసుకొచ్చి మీ శిరస్సుమీద అలంకరిస్తాడు ఈశ్వరుడు. బలవంతంగా సాధనలు చేసి మీరు ఈశ్వరుడిని మోసం చెయ్యలేరు, మీ హృదయంలో ఈశ్వరుడి మీద గౌరవభావం లేనప్పుడు సాధనలు అని చెప్పి మీ సాధనల పేరు మీద ఎంతకాలం ఈశ్వరుడిని మోసం చెయ్యగలరు? మనం చేసే సాధన కాదు ఈశ్వరుడు చూసేది, మన హృదయాన్ని చూస్తాడు. భగవంతుడు వైకుంఠంలో ఉంటే మనం భగవంతుడిని మోసం చెయ్యవచ్చును, కైలాసంలో ఉంటే కూడా మనం భగవంతుడిని మోసం చెయ్యవచ్చును. నీ హృదయనివాసిని అని పరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. భగవంతుడు నీ హృదయంలోనే నివాసం ఉన్నాడు. ఎలా ఉన్నాడు? ఆత్మగా ఉన్నాడు. నీకు సాక్షిగా ఉన్నాడు. ఇంక మనం ఆయనను ఎలా మోసం చెయ్యగలము?

కళ్ళు ఉండి మంచి పనులు ఏమీ చెయ్యని వాడు గుడ్డివాడు, మంచి మాటలు చెపుతుంటే ఎవడైతే వినడో వాడు చెవులు ఉన్నా కానీ చెవిటివాడు, నన్ను మీరు అపార్థం చేసుకోకండి. మన కళ్ళు, మన చెవులు, మన నోరు, మనకి ఉపకారం కంటే, ఎక్కువ అపకారం చేస్తాయి. మనకి కళ్ళు ఉన్నాయి, చెవులు ఉన్నాయి, నోరు ఉంది. కానీ అవన్నీ మనకి ఉపకారం చెయ్యటం కంటే, అపకారం ఎక్కువ చేస్తున్నాయి. మన దగ్గర డబ్బు కూడా మనకి ఉపకారం కంటే ఎక్కువ అపకారం చేస్తుంది. మన దగ్గర చదువు కూడా మనకి ఉపకారం కంటే ఎక్కువ అపకారం చేస్తుంది. ఏసు అన్నాడు, నీ కళ్ళు నీకు అపకారం చేస్తుంటే, నీ కళ్ళు పీకి అవతల పారేయి. ఎంతదూరం వెళ్ళాడో చూడండి. నీ కళ్ళు నీకు అపకారం చేస్తుంటే నీ కళ్ళు పీకి అవతల పారేయి అని చెప్పాడు.

ఏసుని శిలువ వెయ్యటానికి తీసుకొని వెళ్తుంటే కొంతమంది స్త్రీలు ఏడ్చారు. నా గురించి ఏడవటం ఆపు చెయ్యండి, స్టాప్ వీపింగ్ ఫర్ మి. నా కోసం ఏడుస్తున్నారా, ఆపు చెయ్యండి. ఎందుకు నాకోసం ఏడుస్తూ కాలాన్ని ఖర్చు చేస్తున్నారు. నాకోసం దుఃఖపడి మీ కాలాన్ని ఖర్చు పెట్టుకోకండి. మీ హృదయంలో ఉన్న వెలుగుని చూడటానికి ప్రయత్నం చెయ్యండి. నా కూడా రండి. నా కోసం ఏడవకండి, హృదయ పరిశుద్ధులు కండి. ఈశ్వరుడి కోసం ఎవడైతే తపిస్తున్నాడో, వాడికే హృదయపరిశుద్ధి వచ్చేది. తపించాలి, ఈశ్వరుడి కోసం తపించాలి. ఈశ్వరుడి కోసం మీరెప్పుడైనా తపన పడ్డారా? మీకెవరికైనా కడుపునొప్పి వస్తే ఐదు నిమిషాలో పది నిమిషాలో గిలగిలా కొట్టుకుంటారు ఆ బాధ పడలేక. అలా ఎప్పుడైనా ఈశ్వరుడి కోసం తపించారా? రోజుకి 24 గంటలు అయితే, ఎన్ని గంటలు మీరు భగవంతుడి కోసం జీవిస్తున్నారు? జీవించటమే తెలియని వాడికి మరణించటం

ఎలా తెలుస్తుంది. బాహ్యవస్తువులతోటి అలంకరించుకోవాలన్న సరదా, ఈశ్వరుని అనుగ్రహంతో అలంకరించుకోవాలని మనకి లేదు. మీరు అలంకరించుకోండి, ఈశ్వరానుగ్రహంతోటి అలంకరించుకోండి.

ప్రపంచంలో ఎన్ని సాధించినా, ఎంత పొందినప్పటికీ అది అంతా ఒకటి లేని సున్నలు. ఎన్ని సాధించినా ఎంత పొందినా ఒకటి లేని సున్నలు. ముందు ఒకటి పెట్టిన తరువాత సున్నలు పెడితే ఆ సున్నలకి విలువ పెరుగుతుంది. ముందు ఒకటి వేసి, తరువాత సున్నలు వేసుకెళ్తూవుంటే పది, వంద, వెయ్యి, పదివేలు, లక్ష.... అలా ఎన్ని సున్నలు వేస్తే అంత విలువ పెరుగుతుంది. ఒకటి లేకుండా మీరు సున్నలు పెట్టుకెళ్తూవుంటే 20 సున్నలు అయినా ఒక సున్నా అయినా ఒకటే. ఆత్మని దర్శించటం వదిలేసి, ఆత్మని వదిలేసి, మీరు ఎన్ని ఘనకార్యాలు సాధించినా అవన్నీ ఒకటిలేని సున్నలు. మొట్టమొదటి ఒకటి లేదు కదా ఇంక సున్నలకి విలువేంటి? ఎన్ని సున్నలు అయినా ఒకటే.

ఎవడైతే మంచిమాటలు వినడో, వాడికి చెవులు ఉన్నా సరే వాడు చెవిటివాడు. మూగవాడు ఎవడు? మాటలు రానివాడు ఎవడు? ఎవడైతే తగిన సమయంలో మంచి మాటలు చెప్పడో వాడు మూగవాడు. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి, కొంతమంది ఏమంటారు అంటే, మేము చెప్పింది వినరు కాబట్టి చెప్పలేదు అంటారు. అది నిజం కాదు. మీకేదైనా మంచి మాట మీరు ఎవరికైనా చెప్పాలనుకుంటే చెప్పండి. చెప్పాలి తప్పనిసరిగా, అవసరాన్ని బట్టి చెప్పాలి. వాళ్ళు వినరనుకోండి, మీకు ఎంటి అసలు? లీవ్ ఇట్ టు గాడ్. దేవుడికి వదిలేయండి. వాడు వినటంలేదు అనేది వేరే విషయం. అదే భగవద్గీతలో ప్రాక్టికల్‌గా చెప్పాడు. మీకు పని చెయ్యటానికే హక్కు ఉంది, చెప్పటానికి హక్కు ఉంది. దాని ఫలితం మీ చేతులలో ఏమీ లేదు. వారు వింటారా వినరా అనేది వేరే విషయం. అవసరమైనప్పడు మీరు మంచి మాట చెప్పండి. మీ పిల్లలు ఉన్నారు, వాళ్ళు శ్రద్ధగా చదువుకోవచ్చు, శ్రద్ధగా చదవుకోకపోవచ్చు. శ్రద్ధగా చదువుకోమని చెప్పండి. వాళ్ళు వినకపోతే అది వేరే విషయం. మీరు చెప్పటం మానొద్దు అంటున్నాడు. అదీ! ఒకవేళ మంచిమాట కనుక మీరు చెప్పకపోతే మీరు నోరు ఉండి నోరులేనివారితోటి సమానం. మీరు మంచి దృశ్యాలు చూడకపోతే, కళ్ళు ఉండి కళ్ళులేనివాడితోటి సమానం. మీరు మంచి మాటలు వినకపోతే చెవులు వుండీ చెవులులేనివాడితో సమానం. చెప్పినా వినరండీ అంటారు. అది అనవసరం మీకు అసలు. వాళ్ళు వింటారా వినరా అనవసరం. డు యువర్ డ్యూటీ. మీ పని మీరు చెయ్యండి. వారు వింటారా వినరా అనేది వేరే విషయం. అసలు పేపరు రాయాలి కదా! వాడు ఎక్కువ మార్కులు వేస్తాడా, తక్కువ మార్కులు వేస్తాడా మనం చెప్పలేం. మనం రాసిన

దాన్నిబట్టి ఉంటుంది. అసలు పేపరు రాయాలి కదా, ఎవడో పేపరులో మార్కులు సరిగ్గా వెయ్యడు అని మొత్తం పేపరు రాయటం మానేస్తే ఎలాగ? మన ఇంటిలో అయినా సరే వీధిలో అయినా సరే అవసరమైనప్పడు, సమయం వచ్చినప్పడు నాలుగు మాటలు చెప్పాలి. అసలు చెప్పకపోతే ఏమౌతుందంటే అది మన దోషం. మూగవారితోటి సమానం. వారు వింటారా వినరా అనేది వేరే విషయం.

భారతంలో కృష్ణుడు రాయభారానికి వెళ్తాడు. దుర్యోధనుడు వినడు అన్న సంగతి కృష్ణుడికి తెలియదా? కృష్ణుడు భగవంతుడు కదా! దుర్యోధనుడు వినడు అన్న సంగతి ఈయనకి తెలుసు. కానీ కృష్ణుడు అంతటివాడు మంచి పని చెయ్యలేదు అని లోకం నిందిస్తుందని చేసాను ఆ పని అన్నాడు. కృష్ణుడు ఉండి కూడా నాలుగు మంచి మాటలు చెప్పలేకపోయాడు అని లోకం ఎత్తిపోస్తుంది అని నాలుగు మాటలు చెప్పాడు. దుర్యోధనుడు వినడు అనే సంగతి ఈయనకి తెలుసు. మన డ్యూటీ మటుకు చెయ్యాలి. తరువాత ఏమనిపిస్తుంది అంటే కృష్ణుడు చెప్పలేదు అనిపిస్తుంది. చెప్పి వుంటే వినేవాడేమో అని మళ్ళీ లోకం అంటుంది కృష్ణుడిని. ఎక్కడో యుద్ధం సమస్యలు కాదు, మన ఇంట్లో సమస్యలు కూడా అంతే. మనం చెప్పవలసిన మాటలు చెప్పాలి. ఒకవేళ వినడు అనుకోండి, వదిలేయండి. మళ్ళీ లోపల ఊరికే పుండు క్రింద పెట్టుకోకండి. వినలేదు వినలేదు అని ఊరికే బాధ పెట్టుకోకండి. అలా బాధ పెట్టుకొంటే మట్టుకు మళ్ళీ కొత్త సంస్కారాలు ఏర్పడతాయి. అది జ్ఞాపకం ఉంచుకోండి. అవసరమైతే మంచి మాట చెప్పండి, వాడు వినలేదు అనుకోండి, వినలేదని మీరు బాధ పడటం మొదలు పెడితే కొత్త సంస్కారాలు వచ్చి మళ్ళీ మీకు తగులుకుంటాయి. అంటురోగాలు వచ్చినట్టు కొత్త సంస్కారాలు వచ్చి మీకు తగులుకుంటాయి.

భగవంతుడు చెప్పిన ముఖ్యమైన మాట ఏంటంటే గీతలో, నువ్వు పని చెయ్యి, ఫలితం నీ చేతిలో లేదు. ఫలితం రావచ్చు, రాకపోవచ్చు, దాని గురించి నువ్వు ఆలోచించకు. ఆలోచించటం వలన నీ శక్తి ఖర్చు కానీ అంతకంటే ప్రయోజనం లేదు. కానీ పని మట్టుకు విడిచిపెట్టకు. ఆ పని యొక్క ఫలితం ఎలా ఉంటుందో ఈశ్వరుడికి విడిచిపెట్టేయి. ఎందుచేతనంటే పని నీ చేతిలో ఉంది కానీ ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉంది. ఫలితాన్ని గురించి నిన్ను ఆలోచించవద్దు అని చెపుతున్నాను కదా అని పనిని మాత్రం విడిచిపెట్టకు అని చెప్పాడు మళ్ళీ కృష్ణుడు. ఎక్కడికక్కడ అటూ ఇటూ కదలకుండా గొలుసులు వేసి కట్టేసినట్టు కట్టేస్తున్నాడు. మిమ్మల్ని ఫలితం కోరవద్దు అంటున్నాడు. భగవంతుడు ఫలితం కోరవద్దు అని చెప్పాడు కదా అని మొత్తానికి పని విడిచిపెట్టకండి అంటున్నాడు.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | | |
|---|---|---|---|
| జూన్ | 16 | మధ్యాహ్నం గం॥ 2-00లకు హైదరాబాద్ అరుణగారి ప్రవచనం | |
| జూన్ | 30 | మధ్యాహ్నం గం॥ 2-00లకు అమలాపురం మాష్టారి ప్రవచనం | |
| జూలై | 16 | గురుపూర్ణిమ | ఉదయం గం॥ 6-00లకు పారాయణ |
| | | | గం॥ 7-00లకు అల్పాహారం |
| | | | గం॥ 8-00లకు పూజా కార్యక్రమం |
| | | | గం॥ 9-00లకు భక్తుల ప్రవచనములు |
| | | | గం॥ 11-00లకు అన్న ప్రసాదం |
| | | మధ్యాహ్నం | గం॥ 1-00లకు భక్తుల ప్రవచనములు |

**SRI RAMANA KSHETRAM A/c. No. 510101006497273**
**Corporation Bank, Palakol Branch, IFSC Code : CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**
**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

## గురువు మార్గదర్శకత్వం

ఎవరి జీవితంలోకైనా గురువు ఎందుకు, ఎలా ప్రవేశిస్తారు అన్నదానికి జవాబు గురువుకు మాత్రమే తెలుసు. అనగా జీవితాన్ని పరిపూర్ణముచేసి, అంతిమ సత్యంలోకి మేల్కొలపడానికే ప్రవేశిస్తారు. సద్గురువుతో అనుబంధం దేశ, కాలాలకు అతీతమైనది. ఎడారిలో తీవ్రమైన ఎండలో, ఇసుకలో సాగే నడకలాంటి మన జీవితయాత్రను, సువాసనలు వెదజల్లే పూలబాట మీద నడచినట్లు చేస్తారు, అప్పుడు అంతర్యాత్ర సుగమం అవుతుంది. మనస్సుకు లోచూపు కలగకపోతే, అసలు ఆధ్యాత్మిక జీవితం ప్రారంభం అవలేదని గుర్తు, అట్టి లోచూపును కలుగుజేసేవాడే గురువు. గురువుచేత ఎన్నుకోబడిన వారు, పులినోట్లో పడ్డ మాంసపుముక్క వంటివారే! అనగా వారి అహంకారాన్ని అనగా అజ్ఞానాన్ని మ్రింగేస్తారు. అజ్ఞానాన్ని, అనగా కాని దానిని చింతిస్తూ, అజ్ఞానము నుండి విడుదల పొందలేము. జ్ఞానము గురించి చింతించడమే తగిన మందు. చీకటిని చింతిస్తూ ఉంటే చీకటి పోదు, వెలుతురును తెచ్చుకుంటే చీకటి పోతుంది. మనము మాట్లాడే ప్రతీమాటలోనూ 'నేను' అనే వ్యక్తిభావన ధ్వనిస్తూ ఉంటుంది. అట్టి వ్యక్తిభావనయే అనగా అహంకారమే, సకల అనర్థాలకు మూలం. వ్యక్తిభావనను అనగా దేహాత్మబుద్ధిని తొలగించుకొనుటయే సకల సాధనల గమ్యం. దేహాత్మబుద్ధినుండి విడుదల పొందితే, అక్కడ ఉన్నదే మోక్షం, అదే గురువు, అదే 'నేను'కు అర్థం. దేహాత్మ బుద్ధి నుండి విడుదలపొంది, జీవుడికి వాస్తవముగా తాను ఎవరో అనుభవైకవేద్యం కావాలంటే, గురుకృపే అత్యంత కీలకం. గురువు జీవితాన్ని జ్ఞానమయం చేసి, ఫలవంతం చేస్తారు. కాబట్టి పరమాత్మచే ప్రసాదించబడిన, ఈ మానవ జీవితాన్ని అర్థవంతంగా అనగా అహంకారరహితంగా జీవించాలి.

ఓం తత్‌సత్

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

# వ్యక్తికి జ్ఞానోదయం కలిగితే - వారి ప్రతీమాట సత్యమౌతుంది

రామకృష్ణ పరమహంసగారిని ఒకరు "మీరు చదువుకోలేదు ఇంత అద్భుతంగా ఎలా మాట్లాడగలుగుతున్నారు" అనగా "అమ్మ చంటి పిల్లలకు అన్నంలో అన్నీ కలిపి పెడుతుంది అవి అయిపోగా వెనుక ఉన్న అన్నాన్ని కలిపి పెడుతుంది. నేను బుద్ధితో ఆలోచించి శ్రమపడవలసిన పనిలేదు" అన్నారు. అలాగే భగవాన్‌ని కోర్టు నుంచి వచ్చిన అధికారి "ఈ అటవీ ప్రాంతాన్ని ప్రభుత్వ అనుమతి లేకుండా ఆశ్రమాన్ని ఎలా నిర్మించారు?" అనగా తగిన సమాధానం చెప్పగా సంతృప్తి పడి వెళ్ళగా భగవాన్‌ని భక్తుడు "ఈ విచారణ వల్ల మీకు అలసట రాలేదు కదా?" అనగా "ఈ బుద్ధితో సమాధానం చెప్పలేదు అలసట లేదు" అన్నారు. అలాగే షిరిడీ సాయిబాబాను ఇదేరీతిగా విచారణ చేయగా నా బుద్ధితో ఆలోచించలేదు అన్నారు. భగవాన్ నమ్మకంలో హరిజన్ పత్రికలో గాంధీజీని ఈ మాటను "నేను ఈ రాజ్‌కోట ప్రయాణానికి ఎందుకు వెళుతున్నానో నాకే తెలియదు. ఈశ్వరుడు నడిపిస్తున్నాడు నా ఊహలు నా సంకల్పాలు చెల్లవు" అనాగా దానిపై భగవాన్ "అది యదార్థమైన మాట" అన్నారు. శ్రీనాన్నగారు "జ్ఞాని అరువు తెచ్చుకొని, ఎంపిక చేసుకొనే ఎంగిలి మాటలు మాట్లాడవలసిన పనిలేదు అంటూ మరోసారి నేను సబ్జక్టు నుంచి తప్పకొని కొన్నిమాటలు వస్తే భగవాన్ నన్ను మొట్టికాయలు పెడుతున్నారు" అన్నారు. జ్ఞాని మాటలు వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతలకు అతికినట్లు ఉంటాయి. అయితే ఏ జ్ఞానికి అనుకరణ ఉండదు. ఎవరి పంథా వారిది. పండితుల ఆడంబరమైన మాటలు, యమకాలంకారాలతో శ్రోతలను ఊరించే మాటలు కపట గురువులవి. ఆ ప్రాంగణానికే పరిమితమైపోతాయి. ఇంటికి వస్తే బిడ్డ అమ్మా అనగానే అహంబ్రహ్మస్మి అనే మాట ఎగిరి మాయ అంతా కమ్మేస్తుంది. నన్ను నా బిడ్డ 'అమ్మా' అంది అని ప్రకృతిలో పడిపోతారు. శ్రీనాన్నగారు "నా మాటల్లో పవిత్రత ఉంటే మిమ్ములను జన్మజన్మలకు వెంటాడతాయి" అన్నారు. ఒకరు నాన్నగారితో ఎవరైనా సత్సంఘంలో మాట్లాడమంటే మాట్లాడవచ్చా? అనగా "మాట్లాడండి. మీలో ఎంత పవిత్రత ఉంటే అనగా పదిపైసలా, పావలా ఉంటే అది సాధకునకు అందుతుంది. ఏ సాధకుడు ఒకరికి ఉపదేశం చెయ్యాలి నన్ను బాగా మాట్లాడారు అనే దుగ్ధ ఉండకూడదు'వ అన్నారు. అరవింద్ "మనస్సు కంప్లీట్ సైలెంట్ అయితే గైడెన్స్ లోపల నుంచే వస్తుంది" అన్నారు. వారి రచనలు 'సావిత్రి' డివైన్‌లైఫ్ ప్రపంచవ్యాప్తమైనాయి. అలాగే ఠాగూర్ గీతాంజలిలో అద్భుతంగా వ్రాసారు వారిని 'ఆరేటర్స్' అంటారు. అలాగే అన్నమయ్య, త్యాగరాజు, ముత్తుస్వామి, శ్యామశాస్త్రి కీర్తనలు శాస్త్రీయ సంగీతంలో రసహృదయులను ఉర్రూతలూరించాయి. త్యాగరాజు గురించి శ్రీ నాన్నగారు "వారు పాడి సత్యాన్ని తెలుసుకోలేదు. తెలుసుకొని పాడారు" అన్నారు. వారి కీర్తనలను పూర్వగాయకులు బెంబైవైద్యనాథ్ భాగవతార్, కరక్కురై జయరామన్, పట్టంవాళ్ మృధుమధురమైన స్వరాలలో కీర్తనలు ఆలాపించారు. నేటికాలంలో శ్రీనాన్నగారి శిష్యులైన మధురైమణి అయ్యరు పాడారు. ఇండియాలో ఎమినెట్ కళాకారిణి పుట్టు గుడ్డి అయిన గాయత్రి నాన్నగారి సమక్షంలో వీణవాయించగా వారు ఎంతో తృప్తి చెందారు. నేటి కాలంలో బాలు, బాలసుబ్రహ్మణ్యం, సుశీల, బాలకృష్ణ ప్రసాద్, వాణీజయరామ్, ఏసుదాసు ఖ్యాతిగాంచారు. "అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి గానం సోపానం". ఇది ఒక ఛానల్. దీనిని ఉపయోగించి తరించాలంటే రసహృదయం ఉండి తీరాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**